క్లుప్తంగా

కోన వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



క్రిష్ణదొడ్డి కొండపై అన్నదానం చేస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోన వేంకటేశ్వర స్వామి వారికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలో భూదేవి, అలివేలి మంగమ్మ సమేత కోన వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై గ్రామస్తులు, భక్తులకు స్వామివారి ప్రసాదంతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహిస్తున్న గ్రామస్తులు

కోడుమూరు రూరల్: మండలంలోని బైస్‌దొడ్డి గ్రామంలో వెలసిన శ్రీరాములవారి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టను శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులంతా శ్రీరాములవారి ఆలయం వద్దకు చేరుకుని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో గ్రామపెద్దలు పులకుర్తి సత్యారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, అక్కిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తూరులో తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్



తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య కుంజాల శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయ మర్యాదలతో అలేఖ్య కుంజాలకు శాలువాతో సన్మానించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కర్నూలు (టౌన్): అనాథ శవానికి అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేదాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, యహ్యా కర్నూలు సేవా సమితి సభ్యులు నౌషాద్ ముందుకు వచ్చి అంత్యక్రియలు జరిపించారు. వివరాలు.. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో గత నాలుగేళ్లుగా వెంకటేశ్వరరావు (65) అనే అనాథ వృద్ధుడు ఆశ్రయం పొందుతున్నాడు. పెరాలసిస్‌తో వ్యాధితో ఇబ్బంది పడుతున్నారు. వారం రోజులుగా ఆయాసంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. ఆయనకు అంత్యక్రియలు చేసేందుకు వేదాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సునీల్ కుమార్, యహ్యా సంస్థ సభ్యులు నౌషాద్ ముందుకు వచ్చారు. మృతదేహానికి అన్ని తంతులు నిర్వహించి వాహనంలో పాతబస్తీలోని జమ్మిచెట్టు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికకు తరలించి సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు. వసతి గృహం సభ్యులు సందీప్‌కుమార్, ప్రభాకర్, కరుణమ్మ, ఇమ్రాన్ హోటల్ యజమాని వాహీద్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా

కర్నూలు (సిటీ): రాష్ట్రవ్యాప్తంగా శనివారం విడుదలైన ఇంటర్మీడియెట్ ఫస్టియర్ సప్లమెంటరీ ఫలితాల్లో పలు ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు ఆయా కళాశాలల డీన్‌లు తెలిపారు. శ్రీచైతన్య కళాశాల నుంచి ఎంపీసీలో బి.యశస్విని 467 మార్కులతో సత్తా చాటారని ప్రతి ముగ్గురిలో ఒకరికి 420కిపైగా మార్కులు సాధించారని ఏజీఎం మురళీకృష్ణ వివరించారు. బైపీసీలో బి.జ్వాలిత 436 మార్కులు, ఎస్.సద్భాఫ్ 436, కె.భావన 436 సత్తా చాటగా ప్రతి ముగ్గురిలో ఒకరు 410కి పైగా మార్కులు సాధించినట్లు వెల్లడించారు. నారాయణ కళాశాల నుంచి బైపీసీలో ఎం.సహేర 436 మార్కులు, జి.సరియు 436 మార్కులు, షేక్ బొంతల సనా 436, ఎరమ్ రక్షాన్ 436, షేక్ నషిఫా 436, పోతినేని యాషిత 436 మార్కులు సాధించినట్లు డీజీఎం టి.గోవర్ధన్ రెడ్డి, డీన్‌లు తెలిపారు. ఎంపీసీలో వి.హర్షిత 467 మార్కులు, హఫీజ్ ఎమ్.డి తౌసిఫ్ 467, సి.సుగంధిని రెడ్డి 467 మార్కులు, ఎస్.శివ చక్రధర్ 467 మార్కులు సాధించినట్లు వివరించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

- కోడుమూరు, గూడూరులో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



కోడుమూరు మదర్‌సాలో..



సి.బెళగల్‌లో..



కోడుమూరులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



గూడూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కోడుమూరు రూరల్: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి కోడుమూరులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఈద్గా, క్రిష్ణాపురం రోడ్డు వైపు గల మదర్‌సా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మండలంలోని పులకుర్తి, క్రిష్ణాపురం, వర్కూరు, ప్యాలకుర్తి, లద్దగిరి, అమడగుంట్ల తదితర గ్రామాల్లో ముస్లింలు ఆయా మసీదులు, ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు తమకున్న దాంట్లో కొంత సొమ్మును పేదలకు దానం చేశారు.

గూడూరులో..

బక్రీద్ పురస్కరించుకుని గూడూరులో ఉదయాన్నే ముస్లింలంతా జామియా మసీదు వద్దకు వెళ్లి అక్కడి నుంచి ఎమ్మిగనూరు రోడ్డు వైపు గల ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే మండలంలోని గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

సి.బెళగల్: బక్రీద్ సందర్భంగా శనివారం మండలంలోని గ్రామాలలో సందడి నెలకొంది. ఉదయం నూతన వస్త్రాలు ధరించిన ముస్లింలు ఆయా గ్రామాల మసీదుల వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి అల్లాహ్ అక్బర్ అంటూ స్తుతిస్తూ ఈద్గాలకు వెళ్లారు. ఈద్గాకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వస్తద్‌లు, అఫిసాబ్ ఖురాన్ ప్రభోదాలను తెలియపరిచారు. సి.బెళగల్‌లో ఢిల్లీ నుంచి వచ్చిన హాఫీసాబ్ ప్రార్థనలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ముస్లింలు త్యాగాలను, శాంతి స్వభావాన్ని కలిగి ఉండాలని బోధించారు. అదేవిధంగా త్యాగం, శాంతి ఫలితాలను వివరించారు. మహిళలు, చిన్నారులు ప్రార్థనలలో పాల్గొన్నారు. మండలంలోని గొల్లలదొడ్డి, సంగాల, పోలకల్, మారందొడ్డి, ముడుమాల, గుండ్రేవుల, కొత్తకోట, కంబదహాల్ తదితర గ్రామాలలో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సి.బెళగల్ ఈద్గా వద్ద ఎస్ఐ పరమేష్‌నాయక్ పోలీస్ సిబ్బందితో బందోబస్త్ నిర్వహించారు.



సి.బెళగల్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

పాణ్యం: మండలంలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని నూతన వస్త్రాలు ధరించి ఉదయాన్నే ఈద్గాల వద్దకు చేరుకున్నారు. మతపెద్దలు ఇచ్చిన సందేశాన్ని ఆలకించారు. ఎంపీడీఓ కార్యాలయం పక్కనే ఉన్న ఈద్గాలో ముస్లింలు భారీగా హాజరై ప్రార్థనలు నిర్వహించుకున్నారు. శాంతిరాం ఆసుపత్రి వద్ద ఉన్న సున్ని ఈద్గా వద్ద ముస్లింలు బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

గడివేముల: మండల వ్యాప్తంగా ముస్లింలో శనివారం బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయాన్ని మసీదులు, ఈద్గాల వద్దకు చేరుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇమామ్‌లు బక్రీద్ పండుగ సందేశాన్ని వివరించారు. గడివేములతో పాటు బిలకలగూడూరు, గని, మంచాలకట్ట, బూజునూరు, పెసరవాయి, కరిమద్దెల, కొర్రపూలూరు గ్రామాల్లోని ముస్లింలు అధికసంఖ్యంలో పాల్గొన్నారు.



గడివేముల ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

చిన్నపాటి వర్షానికే జలమయం



పాణ్యం బ్రిడ్జి కింద నిలిచిన వర్షపునీరు

పాణ్యం: మండలంలో శనివారం విస్తారంగా వర్షాలు కురిశాయి. ఉదయం కొణిదేడు, ఆలమూరు, గోనవరం, భూపనపాడు, నెరవాడ తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం పాణ్యం, బలపనూరు, కౌలూరు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లపైకి నీరు వచ్చి చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాణ్యంలోని వీయూపీ(వెహికల్ అండ్ పాస్) కింద వర్షపునీరు అధికంగా నిల్వ ఉండటంతో వాహన దారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో చిన్న పాటి వర్షానికే బ్రిడ్జి కింద మడుగును తలపిస్తోంది. అయ్యప్పరెడ్డి కాలనీలో రోడ్లపైకి నీరు రావడం వల్ల స్థానికులు ఇబ్బంది పడ్డారు.

ఎర్రదొడ్డిలో మోస్తరు వర్షం



పొలాల్లో పారుతున్న వర్షపునీరు

కోడుమూరు రూరల్: మండలంలోని ఎర్రదొడ్డి, చిల్లబండ, అనుగొండ గ్రామాల్లో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. అరగంటకుపైగా వర్షం కురవడంతో ఆయా గ్రామాల్లోని వ్యవసాయ భూములు తడిసి ముద్దవ్వగా, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో పొలాల్లో ఎక్కడ చూసిన వాననీరు నిలిచింది. రెండు వారాలుగా వానల్లేక అల్లాడుతున్న రైతులకు ప్రస్తుతం కురిసిన వర్షం ఊరటనివ్వగా, ముందస్తు వానలకు విత్తిన పత్తి పైర్లకు మేలు చేకూరింది.

అనుమతులు లేనిదే మట్టి తవ్వరాదు





జేసీబీలతో ట్రాక్టర్‌లో మట్టి తవ్వుతున్న దృశ్యం,వివరాలు నమోదు చేసుకుంటున్న మైనర్ ఇరిగేషన్ ఏఈ చంద్రుడు

పాణ్యం: అనుమతులు లేనిదే మట్టి తవ్వరాదని మైనర్ ఇరిగేషన్ ఏఈ చంద్రుడు సూచించారు. పిన్నాపురం రస్తాలో ఉన్న ఓబులమ్మ కుంటలో మట్టి తవ్వుతున్న జేసీబీ, నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆయన శనివారం తెలిపారు. ఓబులమ్మ కుంట దాదాపు 8 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. రైతులకు మట్టి తీసుకునేందుకు దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇస్తామన్నారు. అనుమతులు లేకుండా కుంటలో మట్టిని తవ్వితే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు.

భీరప్ప స్వామి ఆలయానికి విరాళం

కర్నూలు(అర్బన్): నగర శివారులోని పెద్దపాడు రోడ్డు ఏపీ ఆదర్శ పాఠశాల సమీపంలో నిర్మిస్తున్న భీరప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి కల్లూరుకు చెందిన కే.ఉమామహేశ్వర్ శనివారం రూ.25 వేల నగదును విరాళంగా అందించినట్లు జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణంతో పాటు ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్, విద్యార్థులకు హాస్టల్ నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. దాతలు ముందుకు వచ్చి ఆర్థికంగా సహకారం అందించాలని కోరారు.

రైలు కింద పడి మహిళ మృతి

ఆదోని సెంట్రల్: కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన హరిజన చిట్టెమ్మ(38) అనే మహిళ శనివారం ఉదయం 9;45 గంటల సమయంలో గూడ్స్ రైలు కింద మృతి చెందినట్లు ఆర్‌పీహెచ్‌సీ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. వివరాలు.. మృతురాలికి వివాహమై 15 ఏళ్లు అయినా పిల్లలు కలగకపోవడం, గతంలో భర్త హరిజన చిన్న వెంకటేష్‌కు యాక్సిడెంట్ కావడం.. దీంతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వసతి గదుల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరిలో వెలసిన గిడ్డాంజనేయస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల వసతి కోసం నిర్మించ తలపెట్టిన వసతి గదుల నిర్మాణ పనులకు కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కాంట్రాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. కోట్ల హర్ష ముందుగా గిడ్డాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామపెద్దలు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటశివుడు, వెంకటేశ్వరరెడ్డి, పాల గిడ్డయ్య, గిరిబాబు, రామ గిడ్డయ్య, వెంకటేశ్వర్లు, డీలర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.




దిగువపాడు గ్రామం మూల టర్నింగ్ దగ్గర ప్రమాదకరంగా ఉన్న మలుపు

ప్రమాదకరంగా మలుపు

కర్నూలు(రూరల్): దిగువపాడు గ్రామ సమీపాన రోడ్డుపై మూల టర్నింగ్ ప్రమాదకరంగా ఉంది. ఈ గ్రామం కర్నూలు–నంద్యాల జిల్లాకు సరిహద్దుగా ఉంది. ఇక్కడి నుంచి మిడ్తూరు మండలం దగ్గరగా ఉండటం వల్ల పలు గ్రామాల వాహనదారులు మిడ్తూరు – కర్నూలుకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదకర మలుపు ఉండటంతో రాత్రి సమయాల్లో, వర్షాలు కురిసినప్పుడు ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో జరిగిన ప్రమాదాల్లో కొందరు మృత్యువాత కూడా పడ్డారు. ఈ మలుపు వద్ద రోడ్డుకు గతంలో ప్రహరీ ఉండేది. ప్రస్తుతం ప్రహరీ దిమ్మెలు కింద పడిపోయాయి. మలుపు వద్ద కంప చెట్లు పెరిగి రోడ్డు చిన్నదిగా అయిపోయింది. అధికారులు స్పందించి మలుపు వద్ద రోడ్డును విస్తరించి, సూచిక బోర్డులు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మెదడులో కల్లోలం

- పెరుగుతున్న బ్రెయిన్ ట్యూమర్ బాధితులు
- ఆధునిక పద్ధతిలో ట్యూమర్ల తొలగింపు
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే



బ్రెయిన్‌లో ట్యూమర్ చిత్రం

కర్నూలు(హాస్పిటల్): బ్రెయిన్ ట్యూమర్ ఇప్పుడు పట్టణాల నుంచి పల్లెల దాకా అందరికీ తెలిసిన పదం. ఎందుకంటే చాలా మందిలో ఈ వ్యాధి వస్తోంది కాబట్టి. ధూమపానం చేయడం, రేడియేషన్ ప్రభావానికి గురికావడం, మొబైల్ ఎక్కువగా వాడే వారిలో ఈ సమస్య వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకుంటే ప్రమాదం నుంచి బయటపడవచ్చు. మెదడులో కణితులపై అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే నిర్వహిస్తోంది.

జిల్లాలో మెదడులో కణితులు (బ్రెయిన్ ట్యూమర్లు) ఉన్న వారి సంఖ్య అధికమవుతోంది. గతంలో ఇలాంటి సమస్యల చికిత్సకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వెళ్లేవారు. ఇప్పుడు కర్నూలులోనే చికిత్స చేస్తున్నారు. ఈ సమస్యతో ప్రతి లక్ష మందిలో పది మంది బాధపడుతున్నట్లు వైద్యుల గణాంకాలు చెబుతున్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరో సర్జరీ విభాగంలో నిర్వహించే ఓపీకి మెదడు, వెన్నుపూసకు సంబంధించి సమస్యలతో 250 నుంచి 300 మంది దాకా రోగులు చికిత్స కోసం వస్తారు. ఇందులో 10 నుంచి 15 మంది బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న వారున్నారు. నెలకు 10 నుంచి 15 మందికి ఆపరేషన్ చేస్తున్నారు. ఈ మేరకు గత ప్రభుత్వం అందించిన అడ్వాన్స్‌డ్ మైక్రోస్కోప్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఆపరేషన్లన్నీ ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకంలో ఉచితంగా నిర్వహిస్తున్నారు. దీంతో పాటు నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యుల వద్దకు రోజుకు 20 నుంచి 30 మంది దాకా చికిత్స కోసం వస్తున్నారు.

బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలు

బ్రెయిన్ ట్యూమర్ విధం, పరిమాణం, స్థానం, పెరిగే వేగం వ్యక్తుల వారీగా మారుతూ ఉంటాయి. లక్షణాలను గుర్తించడం కొంత కష్టం కావొచ్చు. ఇందులో ముఖ్యంగా తలనొప్పి, తలలో ఒత్తిడి అనిపించడం, ఉదయాన్నే ఎక్కువగా తలనొప్పి రావడం, పడుకున్నప్పుడు తలనొప్పి పెరగడం, వికారం, వాంతులు, డబుల్ విజన్ (ఒక వస్తువు రెండుగా కనిపించడం) వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంత మందిలో ట్యూమర్ స్థానం ఆధారంగా మరికొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అందులో కుదుపులు, చూపులో సమస్యలు, మాట్లాడటంలో ఇబ్బంది, నడవడంలో కష్టం, ముఖం ఒకవైపు వంగిపోవడం, ప్రవర్తనలో మార్పులు, జ్ఞాపకశక్తి లోపాలు ఉంటాయి.

బ్రెయిన్ ట్యూమర్ రకాలు

మెదడులోని కణజాలంలో ఏర్పడే ముద్దను వైద్యులు బ్రెయిన్ ట్యూమర్‌గా గుర్తిస్తారు. ఇందులో ప్రైమరీ బ్రెయిన్ ట్యూమర్, సెకండరీ బ్రెయిన్ ట్యూమర్. ప్రైమరీ బ్రెయిన్ ట్యూమర్ నాలుగు విభాగాలుగా ఉంటుంది. సెకండరీ బ్రెయిన్ ట్యూమర్‌లు శరీరంలో వివిధ భాగాల్లో సోకుతాయి. అవి రక్తంలో ప్రవేశించి మెదడుకు చేరతాయి. దీని ద్వారా మెదడులో కణితులు ఏర్పడతాయి. కొన్ని రసాయనాల బారిన పడటం, రేడియేషన్ ఎక్కువగా ఉండటం, ఎక్స్‌టీమ్ వైరస్ బారిన పడటం వల్ల ఈ ట్యూమర్లు ఏర్పడతాయి.

కారణాలు, వ్యాధినిర్ధారణ

సాధారణంగా మానవుడి మెదడులో ట్యూమర్లు జన్యుపర లోపాల వల్ల, వంశపారంపర్యంగా వస్తాయి. మెదడుకు రేడియేషన్ సోకడం వల్ల కూడా ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. సెల్‌ఫోన్ విపరీతంగా వాడటం వల్ల రేడియేషన్ సోకి మెదడులో గడ్డలు ఏర్పడే అవకాశం ఉంది. ప్రస్తుతం చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అన్ని వయస్సుల వారికీ ఈ సమస్య వస్తోంది. బ్రెయిన్ ట్యూమర్‌ను క్లినికల్, రేడియాలజీ, సర్జికల్ విధానాల్లో నిర్ధారిస్తారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ పరీక్షల ద్వారా ఇది నిర్ధారణ అవుతుంది. కొందరిలో మాత్రమే ఆపరేషన్ ద్వారా నిర్ధారణ అవుతుంది. నిర్ధారణ అనంతరం మాత్రమే వైద్యులు చికిత్స ప్రారంభిస్తారు.

ప్రమాద స్థితిని పెంచే బ్రెయిన్ ట్యూమర్లు



దీర్ఘకాలంగా కిరణ వికరణ (రేడియేషన్)కు గురయ్యే వ్యక్తులు, ధూమపానం చేసే వారు బ్రెయిన్ ట్యూమర్‌కు గురయ్యే అవకాశాలు ఉంటాయి. బ్రెయిన్ ట్యూమర్లు చాలా ప్రమాదకరమైనవి. వీటిని సకాలంలో గుర్తించి చికిత్స చేయకపోతే ప్రాణాపాయం కలగవచ్చు. ఏ మాత్రం అనుమానం ఉన్నా ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆలస్యం ప్రాణాలకు హానికరం కావచ్చు.

– డాక్టర్ కేఎస్.విశ్వకుమార్, న్యూరోసర్జన్, కర్నూలు

ట్యూమర్లను నిర్లక్ష్యం చేయరాదు



బ్రెయిన్ ట్యూమర్లను నిర్లక్ష్యం చేయరాదు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి. లక్షణాలను బట్టి స్కానింగ్ చేసి కణితి ఉందా లేదా అని వైద్యులు నిర్ధారిస్తారు. వైద్యపరీక్షల్లో మెనింజియోమా అనే చిన్న కణితి ఉంటే మాత్రం దానికి సర్జరీ అవసరం ఉండదు. అది మెదడులో ఉన్నా ఏమీ చేయదు. ఇది క్యాన్సర్ కణితిగా మారే అవకాశం లేదు. ఆడవారిలో పిట్యూటరీ గ్రంధి వద్ద ఏర్పడే మాక్రో అడినోమా అనే కణితి వల్ల కంటి చూపు సమస్య వచ్చే ప్రమాదం ఉంది.

– డాక్టర్ కె.హేమంత్‌కుమార్, న్యూరాలజిస్టు, కర్నూలు



ఎల్లమ్మ గుడి సమీపంలో చెత్త దిబ్బపై పందుల గుంపు

బాబోయ్ పందులు!



చిన్నమ్మ వాగు, పెద్దమ్మ వాగు సమీపాన పందుల స్వైర విహారం

కర్నూలు(రూరల్): చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలు పలుకుతున్నారు. పంచాయితీ అధికారుల అలస్వతం ప్రజలకు శాపంగా మారింది. రోడ్లపైనే చెత్త దిబ్బలు.. మురుగు.. రోజులు తరబడి అలానే ఉండటంతో దుర్వాసన వ్యాపిస్తోంది. కర్నూలు మండల పరిధిలోని దిగువపాడు పంచాయతీ పరిధిలో పందులు స్వైర విహారం చేస్తూ ప్రజలను ఇబ్బందులను గురిచేస్తున్నాయి. పలు కాలనీల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నా అధికారులు సమస్య పరిష్కారానికి పూనుకోవడంలేదు. ముఖ్యంగా ఎస్సీ కాలనీ, చిన్నమ్మ వాగు, పెద్దమ్మ వాగు, అంబేడ్కర్ విగ్రహం కూడలి సమీపాన, ఎల్లమ్మ ఆలయం సమీపాన పందులు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. పంచాయతీ అధికారుల ఇప్పటికైనా స్పందించి చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తొలగించి పందుల బెడద లేకుండా చూడలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

కనులపండువగా చెన్నకేశవస్వామి కల్యాణం

వెల్దుర్తి: మండలంలోని ఎస్ పేరేముల గ్రామంలో శనివారం శ్రీలక్ష్మీ, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. గ్రామస్తుల ఆధ్వర్యంలో రమణమ్మ, బొంతల రామకృష్ణారెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించిన వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మహోత్సవాన్ని తిలకించారు.